

ఆలా ఎంతసేపున్నానో నాకే తెలియదు. నిద్రపోయానేమో అని అనుకుంటాను. ఇంతలో ఎవరో ఎక్కడో వెక్కివెక్కి ఏడుస్తున్నట్లనిపించింది. తలఎత్తి వీధివైపు చూశాను. వెన్నెల నీడలో వసారాలో వీధిగుమ్మాన్ని ఆనుకుని ముఖానికి రెండుచేతులు అన్చుకొని ఏడుస్తోం దామె. వెంటనే గుర్తుపట్టాను— ఆమె నిర్మల.

స్విచ్ ఆన్ చేస్తూ "నిర్మలా నీవా?" అని అడిగేను. దీపం వెలగగానే నిర్మల "చిన్నాన్నా అంటూ నా ఒళ్ళో పడి ఏడ్వడం మొదలువెట్టింది. నిర్మల ఏడుస్తూంటే నా గుండె గుభిల్లు మని అన్నది. మాధవ్ ఎలా వున్నాడో అని కంగారు పడ్డాను. "నిర్మలా! ఏమిటమ్మా ఇది! నాన్న కులాసాగా ఉన్నాడా?" అని అడిగాను. నిర్మల ఏడుపు మానలేదు. జబ్బుతో ఉన్న మాధవ్‌దగ్గరకి పరుగెత్తి పోవా లనిపించింది. కాని నిర్మల నన్ను కుర్చీలోంచి లేవనీయలేదు. నిర్మల ఇంకా ఏడుస్తునే ఉన్నది.

మళ్ళా ఆదేప్రశ్న వేశాను, తలనిమురుతూ. "లే, నిర్మలా. ఏం జరిగిందమ్మా; నాన్న కులాసాగా ఉన్నాడా? రాజుతో ఏమన్నా కలహించావా?" అని అడిగాను. రాజు పేరెత్తగానే నిర్మల తల ఎత్తి "చిన్నాన్నా......నాన్న పెళ్ళికి

ఒప్పుకోలేదు!' అంటూ మరింతగా ఏడ్వడం మొదలుపెట్టింది.

సముదాయించే మాటలతో, "ఊరుకో నిర్మలా! జరిగిన విషయం చెప్పు నాన్న పెళ్ళికి ఎందుకు వద్దన్నాడు?" అని అడిగాను. కొద్దిసేపటికి నిర్మల తేరుకుని చెప్పడం మొదలుపెట్టింది.

"మా పెళ్ళిగురించి రాజు నాన్నతో చెప్పాడు. నాన్న మొదట్లో ఏమి సమాధానం చెప్పలేదు తరువాత నేనే నాన్న నడిగాను రాజుతో ఈ పెళ్ళి జరగ డానికి వీలులేదన్నారు రాజు ఎంతో బ్రతిమలాడుతూ చెప్పాడు. నాన్న కాదన్నారు. చిన్నాన్నా! నే నేం చెయ్యాలి? రాజు తనతో తీసికెళ్ళి చేసికుంటా నంటు న్నాడు కాని చిన్నాన్నా? నేను నాన్నను విడిచి ఉండలేను రాజునుకూడ విడువ లేను నే నేం చెయ్యాలి చిన్నాన్నా? నే నేం చెయ్యా లిప్పుడు?" అంటూ ఏడ్వడం మొదలుపెట్టింది.

"పదమ్మా! మనం ఇక్కడ కూర్చుంటే విషయము ఎలా తెలుస్తుంది?" అని నిర్మలను తీసికొని మాధవ్ ఇల్లు చేరాను ఊరి చివర నా కేమీ సంబంధము లేదన్నట్టు మామిడితోపువైపు ముఖం త్రిప్పుకొని ఉన్న దా ఇల్లు. గాలి తాపాలకు, ఎండ వానలకు ఆ ఇల్లు ఓడిపోయింది ఆ ఇల్లు చూస్తే ఏనాటి శిధిలాలో జ్ఞాపకానికి రాక మానవు. ఆ ఇంటిని దాటివచ్చేవారు. బ్రతికిచెడిన ఆ ఇంటి వారిని తలచి వారిని గూర్చి ఒక్కొక్క నొక్క నిట్టూర్పు అయినా విడువక మానరు. నేనూ అంతే. నేను చేసేదీ అంతే. చేయగలిగేదికూడా అంతే

నేను చేరేసరికి ఇంటిలో దీపా లన్నీ ఆర్పి, పెంకు లూడిన కప్పులోంచి పడు తున్న వెన్నెల్లో ఒక కుర్చీలో కూర్చుని ఉన్నాడు మాధవ్. వెన్నెల పూర్తిగా అతనిమీద పడటంలేదు. కొద్దిగా మాత్రం అతని పాదాలమీద, చేతులమీద పడు తున్నది నేను రావడం చూచాడు మాధవ్ నే వచ్చినపని గ్రహించా డతను. మాట్లాడకండ కూర్చున్నాడు అతని ప్రక్కనే ఇంకొక కుర్చీలో "రాజుతో నిర్మల పెళ్ళి వద్దన్నావట ఎందుకు?" అని అడిగాను. అతని జవాబుకై నే నెంత ఆతృత పడుతున్నానో గుమ్మం దగ్గర లతికాస్థంభముపై లత మాదిరి నిలుచున్న నిర్మలకు అంత ఆతృత ఉన్న దని గ్రహించాను.

మాధవ్ ఒక్కసారి నా ముఖంలోనికి చూచి ఊరుకున్నాడు. మళ్ళీ అదేప్రశ్న అడిగాను "మాధవ్! రాజులో ఏమైనా లోపా లున్నవా?"

మాధవ్ గబుక్కున అన్నాడు. "లేదు రఘూ, లేదు; రాజు చాల సుగుణ వంతుడు" అన్నాడు.

"అందగాడు అనాకారి కాడు."

"అవును"

"విద్యాధికుడు — ఉద్యోగి"

"అవును''

"కట్నం లేకుండా నిర్మలను చేసు కుంటాడు."

"అదీ నే కాదనలేదు.''

"మరి ఎందుకని నీ కీ పెళ్ళి ఇష్టం లేదు" అని అడిగాను.

"నా కీ పెళ్ళి ఇష్టంలేదు'' అన్నాడు మాధవ్. 'ఆలస్యంగా ఎందుకొచ్చా' వని అడిగితే, 'అవును, ఆలస్యంగా వచ్చా' నని చెప్పే విద్యార్థిలాగా."

"నీవు ఇంతకన్నా గొప్ప సంబంధము తేలేవు" అన్నాను

"..............."

''కానీ, సంబంధం విడుచుకోవటంలో ఎంత తెలివితక్కువ పని చేస్తున్నావో ఆలోచించు.''

"మంచిపనే చేస్తున్నాను.''

"మాధవ్ ! " గట్టిగా అరిచాను. "మాధవ్ ! నీకు పిచ్చిగాని ఎక్కలేదు కదా ! తల్లిలేనిపిల్లకు నీవు చేసే న్యాయం ఇదేనా : ఈ ఇంటితోపాటు ఎప్పుడో ఒకప్పుడు మన జీవితాలు కూడ పోక తప్పవు. ఈ లోపలే నిర్మల భవిష్యత్తుకు మంచిఇల్లు కట్టాలి. మనం అలా కానినాడు స్వర్గంలో ఉన్నా సరే మనం దాని దుఃఖజీవితం చూడక తప్పదు; మాధవ్, చూడక తప్పదు." మాట్లాడుతున్న కొద్ది నా గొంతుక బొంగురు పోయింది.

"నిర్మల మీద నీ కేపాటి అధికారం ఉన్నదో నాకూ అంతే ఉన్నది. ఏ చేతితో పాలన్నము కలిపి పెట్టామో ఆ చేతితో విషం త్రాగిస్తామా మాధవ్ ! నిర్మల నా పిల్ల ..." కొద్దిసేపాగి మళ్ళీ అన్నాను "మాధవ్ ! నీకు గాని పిచ్చి ఎక్కినట్లయితే మాట్లాడకుండా ఊరుకో: పిచ్చి కాకపోతే మంచివాడిలా ఊరుకో. అలా కానినాడు మాధవ్, ఈ పెండ్లినే చేసి తీరుతాను రిజిష్టరు మ్యారేజి అయినా చేయిస్తాను"అన్నాను కోపంగా.

"రఘూ!" గట్టిగా అరిచాడు మాధవ్. తరువాత స్వరం బాగా తగ్గింది. "అంత పని చెయ్యకు రఘు అంత పని చెయ్యకు నీ వన్నట్లు ఏ పిచ్చో వెర్రో ఎక్కినట్లయితే నేను చాల అదృష్టవంతుడనే. కాని లేదు రఘూ, నా కాపాటి అదృష్టం కూడ లేదు నాకు జరిగే అన్యాయా లన్నీ ఓర్చుకోమనే విధి నిర్దేశించింది. నా గుండెల్లో ఎంత బాధ ఉందో నీ కేమి తెలుసు? ఆ బాధ నీ లాంటి మిత్రుడికి కూడ వెలువరించుకోలేని బలహీనుడ నయ్యాను నేను చాల పాపం చేశాను రఘు అందుకనే ఫలాన్ననుభవిస్తున్నాను. చేతి కెదిగిన ఇరువదేండ్ల కొడుకు సుధాకర్ చచ్చిపోయాడు, నీకు తెలియదూ? తన్ను నేను సరిగా ప్రేమించటం లేదని రెండేండ్ల నిర్మలను ఒప్పగించి మనోవ్యాధితో నిర్మల మరణించిన సంగతి నీకు తెలి

యువ

యదూ? రాత్రికి రాత్రి నా ఆస్థి నంతా దొంగలు కొల్లగొట్టడం నీ కళ్ళముందు కాదూ జరిగింది ఒక నాడు చేసిన పాపానికే శిక్షలు పడుతున్నవి. విధి నన్ను బలిస్థంభానికి కట్టివేసింది. ఎలుగు మీదికి వేటకుక్కల నుసికొల్పినమాదిరి. అన్యాయాలను అక్రమాలను విధిస్తున్నది. నే నశక్తుడనే. కానీ ప్రాణం పోయేవరకూ నే పెనుగులాడక మానను. నిర్మల కన్యాయం చెయ్యను. ఈ పెండ్లి చెయ్యను" అంటూ చేతల్లో తలదాచుకున్నాడు మాధవ్ నా కేమి మాట్లాడాలో తోచలేదు


"మాధవ్! నీ మనసు బాగున్నట్టు లేదు. విశ్రాంతి తీసుకో. తెల్లవారిన తరువాత మాట్లాడుకుందాము నీవు నీ జీవితంలో ఎంత పెద్ద తప్పు చేసినా ఇంత కన్నా పెద్ద తప్పు చెయ్యలేవు. ఆలోచించుకో వస్తా" నంటూ నిర్మలనుకూడ నాతో తీసుకొని వచ్చేశాను. పడుకున్నానే గాని నిద్ర పట్టడం కష్టమైంది.

ఎవరో తలుపుదగ్గర పిలుస్తున్నారు. నిద్ర లేచి గడియారం చూచాను — 5 గంటలయింది. తలుపు తెరిచాను. ఇంకా సరిగా తెల్లవారలేదు. "ఊరి చివర ఇల్లాయన యీ ఉత్తరం ఇమ్మన్నారు మీకు" అన్నాడు తలుపు తట్టి నతను. ఉత్తరం తీసుకున్నాను. అతను వెళ్ళిపోయాడు. ఉత్తరం చాల పెద్దది. దీపం వెలిగించి చదవడం మొదలు పెట్టాను. ఉత్తరంలో ఇలా ఉన్నది.

"రఘూ!

ఈ ఉత్తరం వ్రాయవలసివస్తుం దవి నే నెప్పుడో ఊహించాను. కారణం నాకు నేనై నిర్మల పెళ్ళి రాజుతో జరగక పోవడానికి కారణం చెప్పలేను కనుక.

నేను పుట్టుకతోనే భోగభాగ్యములలో పెరిగాను నేను చాల గారాబంగా పెరిగాను. చదువు కూడ చాల ముద్దుగా జరిగింది నే నెప్పుడూ తరగతిలో మొదటి వాడినిగా వాచ్చేవాడిని ఎమ్. ఏ. చదవడానికని ఎప్పుడు విడిచిపెట్టని అమ్మను నాన్నను విడిచి విశాఖపట్నం చేరాను అక్కడనుండి ప్రతి సంఘటనా నేను నీకు చెప్పక తప్పదు. నేను అక్కడికి చేరిన తరువాత గదికోసం అన్వేషణ చేసి చేసి విసిగి వేసారి పోయాను మొదటి సంవత్సరం హాస్టల్‌లోనే గడిపాను. కాని రెండవ సంవత్సరం మాత్రం హాష్టలులో ఉండదలచుకోలేదు. గది కోసం వెతుకుతూ వెతుకుతూ, ఒక హోటల్ లో కూర్చున్నాను. గది కుదుర్చుకోవడంలో గల కష్టాలను మా మిత్రు డొకనితో ఏకరువు పెట్టడం మా యెదుటనే కాఫీ త్రాగుతూ ఇంగ్లీషు పత్రిక చూస్తున్న ఏభై ఏళ్ళాయన గమనించారు. కాఫీ త్రాగడం పూర్తి చేసి "నే నీ వూరివాడనే; మా కిక్కడ పెద్ద ఇల్లు ఉన్నది. కానీ మే మింతవరకూ




'నీ జీతం ఆఫీసులో తీసుకున్నా కానీ...పోయిందిరా...'
'ఎలా పోయింది'
'ఇంకోగంట పేకాడుంటే నా జీతంకూడా పోయేది'—

ఎవరికీ అద్దెకియ్యలేదు. అసలా అభిప్రాయమే లేదు. కానీ మీకు గది దొరకక పోతున్నది కనుక మీకు గది ఏర్పరచుతాను. మా ఇంటికి రండి" అని ఆహ్వానించా రాయన. ఆనందంతో ఆయనను అనుసరించాను. తరువాత ఆయన్ను నిదానించి చూచాను. చాలా నిరాడంబరంగా కనపడ్డా రాయన. ఆయన ఇల్లు చేరాము. అదొక పెద్ద మేడ. ఆధునిక పద్ధతులలో కట్టబడినది. ఇంటి చుట్టూ ప్రహరీ గోడ, ఇంటిముందొక దీపస్థంభం ఉన్నాయి. ఇంకా పరికించి చూచాను. జూకామల్లి పువ్వులు మా రాకకు ఎదురు చూస్తున్నాయి. మారాక గమనించి పూల మొక్కలకు నీళ్లు పోస్తున్న తోటమాలి గేటు తీసాడు. నన్నాయన కుడిచేతివైపు నున్న వీధి వైపు గదిలోనికి తీసుకొని వెళ్లారు. నన్నాయన కూర్చోమని చెప్పి "నాగన్నా!" అని పిలిచారు. ఇందాక పూవుల మొక్కలకు నీళ్లు పోస్తున్న తోటమాలి పని ఆపి వచ్చాడు. "విమలమ్మతో చెప్పి నువ్వూ. రాధా కలిసి మేడమీద గది ఖాళీ చెయ్యండి" అన్నా రాయన.

నేను ఆయన మాటలను త్రుంచేసి "మేడపైన వద్దు; క్రింది భాగములోనే ఏదో ఒక గది ఇప్పించండి" అన్నాను.

"క్రింద నేమీ గదులు లేవే; సరే; నాగన్నా! ఈ గదికి ఎదురుగా ఉన్న ఎడమచేతివైపు గది ఖాళీ చేయించు" అని చెప్పారు. నా వైపుచూచి "సామాన్లు తెచ్చుకో బాబూ!" అన్నారు.

నేను సామాను పట్టుకొని వచ్చేలోగా ఎడమచేతి వైపు గది ఖాళీ చేయించి ఉన్నది. నన్ను చూడగానే పొగాకు చుట్ట తయారు చేసికుంటున్న నాగన్న గబగబా వచ్చి సామాను అందుకొని

గదిలోనికి తీసుకెళ్లాడు. ఆ గది కూడ నే కూర్చున్నంత పెద్ద గదే ఒక మూల రెండు కుర్చీలు, ఒక టేబిలు ఉన్నాయి గదిలోనికి చల్లని గాలి రావడానికి రెండు కిటికీ లున్నాయి. కిటికీతలుపులు తీశాను మల్లెపూల వాసనలు గుప్పున గదిలోనికి ప్రవేశించాయి తలమత్తెక్కిపోయింది- గిలగిల లాడిపోయాను అంతే వీధి వైపు కిటికీ తప్ప ఆ కిటికీ నే నెప్పుడు తెరువలేదు కిటికీ మూసిన తరువాత శ్వాస ఆడసాగింది ఇంతలో "నాగన్నా! వారిని స్నానానికి తీసుకెళ్లు స్నానాల గదిలో వేడినీ ళ్ళున్నాయి'' అన్న దొక కంఠం. ఆ తీయని కంఠం వినడానికి నేను సంవత్సరం ఆగవలసివచ్చింది

ముందులో ఆడవా ళ్ళున్న ఆ ఇంట్లో మసలడం కష్టం అనిపించింది. నాగన్నకు చెప్పాను అందుకు అతను నవ్వి "పోనీండి బాబూ, మీ రంత సిగ్గుపడుతున్నారు కనుక మిమ్మల్ని తెల్లారే లేపేస్తాను మీరు మీ కార్యక్రమం తెములుచ్చుకోవచ్చు" అన్నాడు

"అప్పటి కెవరూ లేవరుకదా!" అని అడిగాను

"ప్రసాదరావుబాబు 5 గంటలకే లేచి పూజకు కూర్చుంటారు. సుందరమ్మగారూ అంతే నిర్మలమ్మగారు ప్రక్కమీంచి ఏడుగంటలకు గాని లేవరు, ఇక పోతే రాధ అది మీకంట పడదులెండి" అన్నాడు నాగన్న.

"ప్రసాదరావుగారు ఎవరు?" అని అడిగాను

"అదేటి బాబూ! అలా అడుగుతారు? ఆరేకదా మిమ్మల్ని తీసికొచ్చింది ఆరే ఇంటి యజమాని నిర్మలమ్మ కూతురు గారు సుందరమ్మగారు ఆయన భార్య గదండి మూలచ్చిమి చేయెత్తి దండం పెట్టాలి" అన్నాడు

ఆనాటినుండి నాగన్న లేపేవేళకి లేచేవాడను అన్నీ నిర్వహించుకొని వీధి వైపు కిటికీ తెరచి చదువుకునేవాడిని ఒక్కొక్కసారి మళ్ళలో పూచిన గులాబి, మొల్ల, మల్లి, గుల్బబ్, మందార పువ్వులనుచూచి పుస్తకాన్ని మరచి అలాగే ఉండిపోయేవాడిని కొద్దికాలంలోనే ఆ ఇంటివారందరితో నాకు పరిచయ మైంది ప్రసాదరావుగారు ఎంత నిరాడంబరజీవో, అంత గంభీరుడు చాల నిదానమైన తత్త్వంకలవాడు ఆయన భార్య సుందరమ్మగారు సరేసరి నేను కాలేజీనుండి తిరిగి వచ్చేసరికి ఏదో ఫలహారం చేసి ఉంచేవారు నీ కాశ్చర్యం కలుగవచ్చు. ఒకసారి శ్రావణమాసంలో వాళ్ళ నిర్మల పేరంటంనుండి తెచ్చిన సెనగలు వేయించి అందరితోపాటు నాకూ కాసిని పెట్టిం దావిడ, ఇంటినిండా ఎన్నిసోఫాలున్నా తివాచీమీదే కూర్చుని మాట్లాడేది ఆవిడ చెయ్యి జాచినవారిని ఒట్టి చేతులతో ఎప్పుడూ పంపలేదామె. నిర్మల ప్రకృతి మాత్రం నా కర్థంకాలేదు

ఆమె దంతా నవనాగరికమైన పద్ధతి కారులో కాలేజీకి వెళ్ళడం, చదువుకుంటూ సన్నగా రేడియో వినడం, తరుచుగా సినీమాలకు వెళ్ళడం, రంగురంగు దుస్తులు ధరించడం ఆమె అలవాటు. ప్రసాదరావుగారు, సుందరమ్మగారు ఆమె యిష్టానికి ఎప్పుడు వ్యతిరేకంగా చెప్పేవారుకాదు. ముందులో నాకు ఆశ్చర్యం కలిగినా, ఆ తరువాత తెలిసికున్నాను 'నిర్మల మొగరాయుళ్ళ నెదిరించే ధీరురా'లని; ఆత్మ విశ్వాసము గల వినయ వర్తిని అనీ. నేను రాధగురించి ఏమీ తెలిసికోలేక పోయాను. నే నామె గురించి తెలిసికొన్న దేమంటే ఆమె తల్లిలేని పిల్లనీ, కులం ఒకటేఅవబట్టి ప్రసాదరావుగా రామెను తెచ్చి తన యింటిలో ఉంచుకున్నా రనీ, ఆమె ఆ యింటిలో 5 ఏళ్ళబట్టి పని చేస్తున్నదనీ. నే నామెను కలిసి, ఆమె గురించి తెలిసికోవా లని ప్రయత్నించినా ఆమె నాకు కనపడిన సమయాలు ఒకటో రెండో. నేను స్నానం చెయ్యడానికి వెళ్ళేటప్పుడు, నాగది శుభ్రం చెయ్యడం, టేబిల్ మీద పుస్తకాలు సరిగా అమర్చడం, ప్రక్క సరిచెయ్యడం, కుర్చీలు సరిగా అమర్చడం జరిగేవి. నే ననుకోవడం రాధే ఈ పను లన్నీ చేస్తోం దని. నాకు చాల బాధవేసేది. నిజానికి అవన్నీ నేను చేసుకునే పనులే. నా పనులు ఆమె చెయ్యటం నాకు కష్టమనిపించి, ఆ మర్నాటినుండి, గది శుభ్రంచేసుకోవడం తప్ప మిగతా పనులన్ని చేసేసికుని స్నానానికి వెళ్ళేవాడిని

ఒకరోజు సాయంత్రం కాలేజీనుండి వచ్చి స్నానం ముగించుకొని పూల మొక్కల పరిశీలిస్తూ పూలలో కూర్చబడిన వివిధ రంగులను తదేకంగా చూస్తున్నాను. నా గన్న నా వెనుక వచ్చి ఏయే మొక్కలు ఎక్కడెక్కడ సంపాదించినవో వాటి కెలా సంరక్షణ చెయ్యాలో చెబుతూ "అసలు పెరడు చూడనేలేదు రండి" అంటూ వెనుక పెరటిలోనికి తీసికెళ్ళాడు. అది నందనోద్యానవన మనిపించేంది. మేము ఆ పెరటిలో ప్రవేశించగానే గులాబి మొక్కలలో అలికిడి అయింది. అటు తిరిగి చూచాను. గుల్లబి పూల తెలుపులో ఒక గులాబి రంగు వల్లె నాకు స్పష్టంగా కనపడి మామిడిచెట్టు మాటుకు సాగిపోయింది. "బాబూ!" అన్న పిలుపుతో ఈ లోకంలో పడ్డాను, "ఏమిటి ఆలోచిస్తున్నారు బాబూ!" అన్నాడు నాగన్న.

"అబ్బే ఈ తోట..." అన్నాను.

"బాబూ! రాధ ఏదైనా తప్పు చేసిందా? గది మీరే సదురుకుంటున్నారట. అది చెప్పుకొని ఏడిచింది బాబూ," అన్నాడు.

"లేదు నాగన్నా. తప్పు చేశారని ఎవ రన్నారు; నాకోసం ఒకళ్ళు బాధపడటం నా కిష్టంలేదు నాగన్నా. ఆ

పను లన్నీ నీచమైనవి కావా? అంత టితో సరిపోయిందీ, తిన్న కంచంకూడ ఇతరులే కడగా లంటావా?" అన్నాను. ఈసారి నాకు మామిడిగున్న వెనుక వల్లెవాటు అంచులు గాలిలో తేలియా డుతూ కనపడ్డాయి. నాగన్న మాటలు నన్ను దృష్టి మరల్చజేశాయి "ఎంత పొరపాటుపడ్డారు బాబూ! ఎవరి పనులు వారే చేసుకోవా లంటే పిల్లా పాప బ్రత కడం ఎలాగ? తిన్న కంచం తల్లికడుగ కపోతే, తిన్న ఎంగిలి తండ్రి తినక పోతే బ్రతకడం ఎలా బాబూ? అవే తల్లికి పిల్లల్నీ, తండ్రికి కొడుకునీ, భార్యని భర్తకీ కలుపుతాయి. ఒకరికి మమత లేకపోతే మనలో జీవ ముండి ఏమి లాభం బాబూ' నేనా పూలమొక్క లకు నీరు పోయకూడదని మీరే నిర్దేశిస్తే నీరులేక అవి బ్రతికే దెలా?" అన్నాడు.

"నీవు చెప్పినది నిజమే నాగన్నా! తండ్రి కొడుక్కి, కొడుకు తల్లిదండ్రు లకు, అన్న తమ్ముళ్ళకూ, చెల్లెళ్ళకోసం శ్రమించడం లోక న్యాయం కాని ఎవరో అమ్మాయి నాబోటివాడి పను లన్నీ చేయడం ఏమి న్యాయం? ఆమె ఎవరు? నే నెవర్ని? నువ్వు నా జోళ్ళను ముట్టు కోవడం నే సహించగలనంటావా? ఇది న్యాయంకాదు నాగన్నా, న్యాయంకాదు" అన్నాను. నాగన్న ఏమీ మాట్లాడలేదు నేను వెనుకకు మరలాను. నన్నతను అనుసరించాడు. నేను మళ్ళా అన్నాను,


"నాగన్నా! నీమీద నా కేమి హక్కులేదు ఆమెమీద కూడ అంతే?" అన్నాను

ఆవ్వాళ పడుకున్నానే గాని నిద్ర పట్టలేదు మనం దేవుడి గురించి ఎం దుకు ఆలోచిస్తామో తెలుసా? అందుకు కారణం దేవుడిగురించి మనం వినటమే గాని కనటం జరుగలేదు. ఒకవేళ ఎవ రైనా దేవుడిని చూచినా అది క్షణాలు మాత్రమే. అప్పటికీ ఆయన అపురూప మవుతాడు. అందుచేతనే మనం ఆతని గురించి ఆలోచిస్తాము. రాధ విష యంలోకూడ అంతే. నాకు తీరిక దొరికి నప్పుడల్లా నే నామెగురించి ఆలోచించే వాడిని

నే నా గదిలో ప్రవేశించి నెలరోజు లయింది నే నింతవరకూ గదిఅద్దె గురించి అడగలేదు. ఒకరోజు సందర్భం చూచుకొని సుందరమ్మగారిని అడిగాను "అద్దేమిటయ్యా! ఎవరన్నా వింటే నవ్వుతారు. అందరి పిల్లలతో నీ వొక డివి'' అందామె కాని నే నూరుకోలేదు. ప్రసాదరావుగారి నడిగాను. ఆయన సుందరమ్మగారిలా అనలేదు. "ఎంత ఇస్తానంటావు!'' అన్నా రాయన

''ఎంత ఇమ్మంటే అంత" అన్నాను.

"నువ్వు ఇవ్వక్కరలేదు. నే పుచ్చుకో నక్కరలేదు. నిర్మలకు ప్రతీ రోజు ఓ గంట, లెక్కలో ఫిజిక్సో చెప్పు"అన్నా రాయన. నా కయోమయ




"అదేంటండీ! హీరో, హీరోయిన్ల కళ్ళు అలా గున్నాయి!!"

"సెకండ్ షో కదయ్యా!!"

మనిపించింది. నాగన్నతో యిలా అన్నారని చెప్పాను. "వా రంత కలుపుగోరు మనుష్యులు బాబూ!'' అన్నాడు.

ప్రసాదరావుగారు చెప్పు అనగానే నిర్మల నాదగ్గర చదువుకోడానికి తయారైనప్పటికీ నా మనస్సు సంకోచించింది. మర్నాడు నిర్మల పుస్తకాలతో నా గదికి వచ్చింది. ''మేష్టారూ! ఇవ్వాళ పాఠం చెప్పాలి'' అంది. నేను తికమకపడ్డాను. ''నీకు చెప్పను పో'' అని ఎలా అనగలను. నిర్మలే "ఇక్కడొద్దు మాష్టారూ; మేడమీద కూర్చుందాము రండి'' అని మేడ మీదికి లాక్కువెళ్ళింది. నిర్మల గది చాల నీటుగా ఉంది. ఒక వైపు గాడ్రేజి బీరువా దాని ప్రక్కనే బట్టల స్టాండు ఉన్నది. దాని మీద జాకెట్లు, లంగాలు, వల్లెవాటులు, చీరలు ఉన్నాయి. ఇంకొక వైపు ఒక టేబిల్, దాని మీద రేడియో, కొన్ని పుస్తకాలు, ప్రక్కనొక బుక్ షెల్ఫు, ఇంకొక ప్రక్క పందిరి మంచము ఉన్నాయి. టేబిల్ ప్రక్కన ఒక టీపాయి, రెండు స్ప్రింగ్ ఛైర్స్ ఉన్నాయి. కిటికీలకు నైలాన్ తెర లున్నాయి. నిర్మల కిటికీలు తెరచి, తెరలు తొలగించింది. బాల్కనీవైపు ఒక తలుపు ఉంది. ఆ తలుపు తెరవగానే అటు ఇటు రెండు కుండీలలో జాజితీగ లున్నాయి.

"మేష్టారూ! ఇవ్వాళ పాఠం ఒద్దులెండి'' అంటూ గాడ్రేజి బీరువా తెర

చింది. నేను బీరువా దగ్గర నిల్చున్నాను. చీరల క్రింద దొంతి నుండి ఒక 'ఆల్బమ్' తీసింది. తలుపు వేసి కుర్చీలో కూర్చుని నా కన్నీ ఫొటోలు చూపించింది. "ఈయన మా అన్నయ్య మురళీ మోహన్; భిలాయిలో ఇంజినీరుగా పని చేస్తున్నారు. ఇది మా అన్నయ్యా లలిత వదినల పెళ్ళి ఫొటో అనుకోండి. ఇది నా ఫొటో, ఇది మా అమ్మది. ఇంకోగమ్మత్తైన ఫొటో చూడండి. ఇ దెవరో చెప్పుకోండి. మా నాగన్న. అప్పుడు బాగా చామంతి పూలు పూచాయన్న మాట. వాటి మధ్య తీయించుకున్నాడు. ఇది రాధ ఫొటో..."అని ఇంకా ఫొటోలు చూపిస్తోంది. నే నా ఫొటోలు చూస్తున్నానే గాని ప్రతి ఫొటోలో రాధ నాకు కనిపించసాగింది. క్రమముగా అ ఫొటో నా హృదయంలో చేరింది. "మేష్టారూ! ఇవ్వాళ సినీమా కెడదామా?" అని అడిగే సరికి నే నీలోకంలోనికి వచ్చాను. ఇంతలో నిర్మల క్రిందికి వెళ్ళింది. గది తలుపు దగ్గర చప్పుడైంది. తలుపు వైపు తిరిగాను. నే నింత వరకూ ప్రత్యక్షంగా చూడని రూపం నాకు కనిపించింది. క్రమంగా అది మనసులోని ఫొటోలో రూపం దిద్దుకున్నది. అమె తటపటాయిస్తూ అక్కడే నిల్చున్నది. నేను ఏమీ మాట్లాడలేదు. నా కా పరిస్థితి దుస్తరంగా ఉన్నది. కొన్ని క్షణాలు కదిలాయి. నేను తల వంచుకొని కూర్చున్నాను. ఆమె గబగబా వచ్చి టీపాయి మీద ట్రే ఉంచింది. గులాబి రేకులవంటి ఆమె అధరాలు చూచి ముగ్ధుడనై పోయాను. ఆమె వెళ్ళిపోయింది. నిర్మల గదిలోనికి గబగబా వచ్చేవరకూ నవ్వుతున్న రాధ ముఖం నా ముందు కనపడుతునే ఉన్నది. సినీమాకు వెళ్ళానే గాని మనసు ఎందుకో బాధగా మూలుగుతూనేఉన్నది.

సాయంత్రం కాలేజీ నుండి రాగానే నిర్మల పుస్తకాలు ముందేసికొని నా కోసం ఎరుదు చూస్తూండేది. నేను రావడం ఏ మాత్రం ఆలసించినా తాను వచ్చి నన్ను తీసికెళ్లేది. గంటకుపైగానే చెప్పే దేమిటో చెప్పేవాడిని. చెప్పేది శ్రద్ధగా వినేది, సందేహాలు తీర్చుకునేది. నేను పాఠం మొదలుపెట్టిన పావుగంటలోనే రాధ కాఫీయో, పాలో తీసికొచ్చేది. మొదటి పావుగంటలో ఉండే ఉత్సాహం మిగత కాలంలో ఉండేది కాదు. కారణం నా కేమీ అర్ధమయ్యేది కాదు. వారాని కొక సారి అయినా నిర్మలతో సినీమాకు వెళ్లడం తటస్థపడేది. కొద్ది కాలంలోనే అమె నాపై ఒక అధికారాన్ని సంపాదించుకున్నది. ప్రతి రోజు ఆమెతో పాటు నన్ను కాలేజీకి తీసికెళ్ళేది. వచ్చేటప్పుడు మాత్రం నడచి వచ్చేవాడిని.

నే చెప్పవలసిన విషయా న్నంతా విడచి నీకు ఏదో చాల చెబుతున్నా ననుకుంటున్నా వేమో, లేదు నేను చాల చెప్ప

డం మాని వేసాను అవి ఏ మాత్రం జీవితంతో సంబంధం లేనివని కాదు కాని వాటి నాలోచించి గాయపడిన హృదయాన్ని ఇంకా గాయపరుప దలచుకోలేదు అయినా నీకు టూకీగా చెబుతాను

ఆ సంవత్సరపు పబ్లిక్ పరీక్షలు పూర్తి అయ్యాయి నిర్మల పరీక్షలు కూడ అయిపోయాయి

అవాళ రాత్రి ఒక విచిత్ర సంఘటన జరిగిపోయింది

అర్ధరాత్రి అయిన వేళ నా తలుపు దగ్గర చప్పుడైంది మెలకువ తెచ్చుకొని చూచాను చల్లగాలికోసం తెరచిఉంచిన తలుపుల నానుకొని ఎవరో నిల్చున్నట్లు కనుపించింది 'ఎవరా' అని సంశయిస్తూ "ఎవరు?'' అని ప్రశ్నించాను నేను ప్రశ్న వేయగానే ఆ ఆకారం గభాలున గదిలోపలికి వచ్చి తలుపు గడయవేసి "దయచేసి గట్టిగా కేకలు వేయకండి' అన్నదా ఆకారం. నన్ను సమీపిస్తూ కంఠం గుర్తుపట్టాను ఆ కంఠం నిర్మలది

''నిర్మలా నీవా?"అంటూ బెడ్ రూమ్ దీపం వెలిగించాను తలమీది ముసుగు తీసివేసి "అవును నేనే, కాని దయచేసి దీపం ఆర్పివేయండి'' అంటూ తానే స్విచ్ ఆఫ్ చేయబోయింది. నేను ఆమె చెయ్యి పట్టుకొని ఆమె ప్రయత్నాన్ని ఆపాను ఆమె సిరసంగా నాకళ్ళలోనికి చూస్తూండి పోయింది

"నిర్మలా! ఏమి టిది ? అర్ధరాత్రి ఏమిటీ సాహసం" అని అడిగాను నిర్మల సమాధానం చెప్పక స్విచ్ మీద ఇంకా నా చేతిలోఉన్న తన చేతివైపు చూచి ఒకసారి గాఢంగా నిట్టూర్చి

"మేష్టారూ। ఈ రెండు చేతులు అలాగే ఎల్లకాలం ఉంటే ఎంతబాగుంటుంది ?" అన్నది

నా కొక్కసారి షాక్ తగిలినట్లయింది స్విచ్ మీదనుండి చెయ్యి తీసివేశాను నిర్మలముఖం ఎఱ్ఱబడింది

"ఏం చెయ్యి వదిలేశారు. నా మాటలు మీకు వింతగా ఉన్నాయా ?"

''వింతకాదు నిర్మలా వింతకాదు నీకు పిచ్చి ఎక్కిందేమో నని భయమేస్తోంది లేక నీవు నిద్రలో నడచివచ్చి నిద్రమత్తులో కలవరిస్తున్నావేమో అని సంశయ మేస్తోంది కాకపోతే ఏమిటీ సాహసం ? ఆలోచించే ఈ మాటలు అంటున్నావా ?"

"ఎంతకాలం ఆలోచించ మన్నారు మేష్టారూ ? ఇంతకాలం నేను చేస్తున్న తపస్సు అదే ఇక ఆలోచించే శక్తిలేదు నాలో సహనం చచ్చిపోయింది మీకోసమైన ఆలోచనలతో నాలో ప్రతిఅణువు శక్తి హీనమైపోయింది ఇలా కొంతకాలముంటే ప్రాణాలే పోతా యేమో అని భయ మేస్తోంది ఇంత జరుగుతున్నా మనసును ఎలా ఉగ్గపట్టుకునేది ?" అని

ప్రశ్నించింది. ఆమె మాటాడుతూంటే గొంతుక జీరవోయింది

"నిర్మలా" అని పిలిచాను ఆ పిలుపులో జీవంలేదు

"మేష్టారూ!" అంది ఆతృతగా


"ఎంతపొరపాటు ఆలోచిచాంవు? నీ యెడ నే నెప్పుడైనా వేరేవిధంగా ప్రవర్తించానా నిర్మలా? అలాటిది నిన్ను నేను ప్రేమించగలనని ఎలాఊహించావు? అని అడిగాను" ఆమెతో మాటాడుతూ నిల్చునేందుకు శక్తిలేక కుర్చీలో కూలబడిపోయాను

"మనసులో ఉండే ప్రేమను వ్యక్తపరచడానికి చేసే నైత్యవర్తనం మనిషిని ఎంతచులకన చేస్తుందో తెలిసే ఈమాటలంటున్నారు మాష్టారూ? మిమ్ములను ఎల్లప్పుడూ ఆరాధిస్తునే ఉన్నాను ఇంత ప్రేమను వెలువరించడానికి వికారంగా ప్రవర్తించటం ప్రేమ కున్న విలువ తెగగొట్టినట్టుకాదా? అందుకనే నాలో ఎంత సంక్షోభం జరుగుతున్నా సరే మీతో వెకిలిగా ప్రవర్తించలేదు మీరుకూడ అలాగే ఉంటారని నేనూ అనుకున్నాను నేను మిమ్ములను ప్రేమించాను నా ప్రేమను స్వీకరించండి అని చెప్పడానికే వచ్చాను కానీ నీతిపథాన్ని తొలిగేందుకు రాలేదు మీ మాటలు వింటూంటే మీరు నన్ను ప్రేమించటం లేదేమో అని అనుమానం కలుగుతోంది ఇంతవరకూ మీరు నన్ను ప్రేమించకకండ ఉండడంలో మీ మనో స్థయిర్యం స్పష్టపడుతోంది. అందుకు నే నభినందిస్తున్నాను. మీరు నన్ను ప్రేమించటం లేదని బాధపడను కాని నన్ను ఇకముందు ప్రేమించగలరేమో అని ఆశించుతున్నాను నేను అందమైనదానినైనప్పటికీ, నా అందాన్ని పణంగా పెట్టి ప్రేమించమని అడగను. నా ధనంచేత, నా సంపదచేత మిమ్ములను మోసగించను మీరు చదువుకున్నవారు అర్ధాంగి మనసు తెలిసి సుఖమైన జీవితాన్ని గడుపగలరు నేను. మీ మనసు, మీ యిష్టా యిష్టాలు మీ అభిరుచులు తెలిసినదాన నవడంచేత, నా జీవితం హాయిగా, సుఖంగా గడచిపోతుం దనే ఆశతో మిమ్ము నన్ను ప్రేమించ మని అడగడానికి వచ్చాను నేను మీ మనసు తెలిసినదాన నగుటచేతనే నా నిశ్చయాన్ని నిర్భయంగా తెలియజేస్తున్నాను. నా వివాహం మీతో జరుగుటకు మా యింట్లో ఎవరూ అడ్డుపెట్టరు. మీ ఆజ్ఞకోసం వేచియున్నాను" అన్నది

నేను కొద్దిసేపు మౌనం వహించి అన్నాను, "నిన్ను నేను ప్రేమించాను" అని

"నిజమా?" అని ఆశ్చర్యంగా అన్నది కళ్ళలో ఆనందం తొంగిచూసింది

"కానీ నేను నిన్ను నా సోదరిగానే ప్రేమించాను ఇకముందుకూడ అలాగే ప్రేమించగల నని హామీ యిస్తున్నాను. నిన్ను నే నెప్పుడూ అర్ధాంగిగా ఊహించ



"త్వరగా పోనియ్యోయ్, రైలు తప్పిపోయే ట్టుంది "
"మీకు ఆ భయం అఖ్ఖర్లేదు బాబూ, మిమ్మల్ని ఈ రైలుకి అందించకపోతే అయ్య గారు నా నౌకరీ తీసేస్తారు "

---

లేదు నిర్మలా ? ఊహించలేను కూడ" అంటూ నిర్మల ముఖంలోకి చూచాను. కళ్ళలోంచి నీళ్ళు బుగ్గలమీదుగా జల పాతంలా ప్రవహిస్తున్నాయి.

"ఏడుస్తున్నావా నిర్మలా ! నన్ను మరచిపో" అన్నాను

అంత దుఃఖంలోను నిర్మల విషా దంగా నవ్వింది కానీ క్షణంలోనే ఆ నవ్వు మాయ మైంది

"వెలిగించినదీపాన్ని ఆర్పివేయడమంత సులభమనుకున్నారా, వికసించిన ప్రేమను త్రుంచివేయడం కోకిల వసంతం లోనే పాడగలదు నెమిలి మేఘమాలికల ముందే నాట్యం చేయగలదు. నేనుకూడ మీ కాళ్ళముందే జీవించగలను. నాకు మీ కాళ్ళ ముందే స్థానం లేదంటే నాకీ ప్రపంచంలోనే స్థానం లేదని అర్థం. అనవసరంగా మీ మనసు పాడుచేశాను. క్షమించండి- వెళతాను" అంటూ ముసుగు సవరించుకొని తలుపు తీసింది.

"వెళ్ళిరామ్మ" అన్నాను

ముందుకు వెడుతున్న నిర్మల వెనక్కు తిరిగి, నా ముందుకు వచ్చి నా ముఖం లోనికి ఒక్క నిమిషం చూచి చటుక్కున నా కాళ్ళకు మ్రొక్కి కంటివెంట వచ్చే నీరు నాపుకుంటూ వెళ్ళిపోయింది.

ఆమె వెళ్ళిపోవడం నా రూమునుండి కాదు ఈ లోకంనుండే వెళ్ళిపోయింది ఆవాళరాత్రే విషం త్రాగి అమె ఆత్మ హత్య చేసుకున్నది నాకుతప్ప ఆమె ఆత్మహత్యలో రహస్యం మరెవరికి తెలియదు నేను చేయని నేరానికి ఆమె ఒక పెద్దశిక్ష విధించింది కలలోనైనా సరే ఆమె కన్నీటిముఖం నన్ను వెంటాడుతూ శపించుతునే ఉంటుంది నిర్మలను మరచిపోలేను అందుకనే నిర్మల పేరు పాపకు పెట్టవలసివచ్చింది

నిర్మల మరణంతరువాత ఉద్యోగాన్ని అన్వేషిస్తూ కొద్దిరోజులు అక్కడే ఉండిపోయాను మనశ్శాంతికోసం సుందరమ్మగారు, ప్రసాదరావుగారు దగ్గరే ఉన్న పల్లెటూరికి వెళ్ళారు ఇక ఆ ఇంట్లో ఉండేది నేనూ, పెరటిలో నున్న గుడిసెలోని రాధా, ఇద్దరమే నాగన్న రాత్రిళ్ళు ఇంట్లో ఉండేవాడుకాదు ఆ రోజుల్లో రాధకు నా ముందు మసలడమే కష్టమయ్యేది అనుకొనేవాడిని.

ఒకరోజు రాత్రి నేను ఇల్లు చేరేసరికి పదిగంటల రాత్రి అయింది బట్టలు మార్చుకొని చదుకునేందుకు పుస్తకం తీశాను.

నా గది నంతా నిశ్శబ్దం ఆవరించింది ఇంతలో వసారాలో ఎవరో పరిగెత్తుకుంటు వస్తున్నట్టు కాళ్ళ చప్పుడు వినపడింది "బాబూ! తలుపు తియ్యండి బాబూ!'' అంటూ ఎవరో తలుపు కొడుతూ అరిచారు ఆ కంఠస్వరం రాధదని వెంటనే గుర్తుపట్టాను తలుపు తీశాను చీకటిలో రాధ ముఖం నాకు కనపడింది నేను తలుపు తెరిచీ తెరవగానే ఆమె నన్ను గట్టిగా కౌగలించుకున్నది ఈ పరిణామానికి తట్టుకోలేకపోయాను నాకు పరిస్థితి అర్థం కాలేదు ''రాధా' ఏమిటి రాధా ! ఏమిటిది'' అడిగాను నా గుండెల్లో ముఖం దాచుకోడానికి ప్రయత్నిస్తున్న రాధ తల ఎత్తింది కండ్లలో కన్నీరు కదలిగా ప్రవహిస్తున్నది ఏదో చెప్పా లనుకున్న దామె చెప్పలేక నా గుండెపై ముఖం పెట్టి ఏడిచిం దామె ఇంతలో ఎవరో ద్వారం దగ్గర నిలబడటు అనిపించింది తల ఎత్తి చూచాను వెంటనే రాధ ''బాబూ ! వాడిని పొమ్మనండి నన్ను నాశనం చెయ్యాలని వస్తున్నాడు పశువు" అన్నది పరిస్థితి కొంత నాకు అర్థమైంది ఆమెను విడిపించుకొని గది ఇవతలికి వచ్చాను నన్ను చూడగానే చేత నున్న వెదురు కఱ్ఱ నా మీది కెత్తాడు నే నా కర్రని రెండుగా విరిచి నాలుగు తన్ని పంపించాను వాడు నన్ను తిట్టుకుంటూ వెళ్ళిపోయాడు నేను గదిలోపలికి వచ్చి తలుపు గడియ వేశాను రాధ ఇంకా నేల మీద పడి ఏడుస్తోంది నేను వీపు తట్టి ''రాధా లే" అన్నాను నిర్మలతో సుమారు సంవత్సరం కలిసి తిరిగాను కాని ఆమె నెప్పుడు తాకలేదు కనీసం

యిప్పుడు మాట్లాడినంత ఆప్యాయంగా కూడ ఎప్పుడు మాట్లాడలేదు ఈ పరిణామానికి నేనే ఆశ్చర్యపోయాను. రాధ నెమ్మదిగా లేచి తల వంచుకుని కూర్చున్నది ఆమెలో తలఎత్తే సాహసము లేక వాలిపోయిన కళ్ళనుండి వెలుపలికి వచ్చే కన్నీరు నాపుకున్నది నేను కొద్ది దూరంలో కూర్చున్నాను "రాధా!'' అన్నాను కన్నీళ్ళ నాపుకుంటూ నా ముఖంచూచి "బాబూ!" అంటూ నేల మీద పడబోయింది. ఆమె తల నందుకొని ఆమె దగ్గరగా చేరాను ''రాధా వాడు నీ కేమీ హాని చేయ లేదు కదా?" అన్నాను లేదన్నట్టు తలూపింది కొద్ది నిమిషములు మా మధ్య నిశ్శబ్దం తాండవమాడింది ''ఇంటికి వెళ్ళగలవా? నే దిగబెట్టనా?" అని అడిగాను "నన్నీ పరిస్థితిలో మీరు వదిలేస్తారా! నన్ను ఒంటరిగా చూచా దంటే బ్రతుకనీయడు అప్పుడు నాకు మరణమే శరణము మీరు కాదు అంటే వెళ్ళిపోతాను. ఏ సముద్రంలోకో" అన్నది.

ఇదే మాదిరిగా నిర్మల అన్నది. కాని దాని పర్యవసానం అంత విషాదంగా మారుతుం దనుకోలేదు

నాకు అయోమయం అనిపించింది

"రాధా! నీ వనే మాటలు నా కర్థం కావటం లేదు " అన్నాను.

"మీ కేమీ నిజంగా తెలియదా?'' అన్న దామె నా కళ్ళలోకి చూస్తూ.

"రాధా! నీవు నన్ను ప్రేమిస్తున్నావా?" అని అడిగాను అప్రయత్నంగా. రాధ తల దించింది "అవును మీ రీ ఇంటికి వచ్చిన నాటి నుండి ఏదో బంధం నన్నూ మిమ్మల్నీ చేర్చటానికి ప్రయత్నించింది

నేను లొంగిపోయాను మీరే ఆనాడు అన్నిపనులు చేసికోవడం చూచి నా కాపాటి భాగ్యంలేదా అని ఎంతగానో విలపించాను నిర్మలమ్మ ఎప్పుడు చదువు కోవడానికి కూర్చుంటారా? ఎప్పుడు మీరు వస్తారా? అని కళ్ళు కాయలు కాచేటట్టు చూచేదాన్ని మీరే నా భాగ్య దైవమని నమ్ముకున్నాను నన్ను మీరు ఏంచేసినా నేను మీదాననే" అన్నది అంటూ నా చేతుల్లోకి ఒరిగిపోయింది నే నేమీ మాట్లాడలేకపోయాను అనునయించే మాటలతో చేతిలోనికి తీసికొని "రాధా! నీవు నాదానవు" అన్నాను రాధ సంతోషంతో ఊగిసలాడింది కొద్దికాలం ఎవరము మాట్లాడలేక పోయాము తరువాత నేనే అన్నాను. "నిన్ను నేను పెళ్ళి చేసికుంటాను కాని అత్తవారిల్లు చేరడానికి కొద్దికాలం ఓపిక పట్టాలి ఎందుకంటే ఇంట్లో నే నందరినీ వప్పించాలి" అన్నాను

"నావల్ల మీకు కష్టాలేమైనా కలుగుతవేమో!" అన్నది

"నీ వుండగా నే నన్నింటిని ఎదిరిస్తాను అయినా నీ కేంలోటు? అంద

మైనదానవు. కులముకూడ వేరుకాదు నిన్ను పెళ్ళిచేసుకోవడం ఎవరూ నన్ను కాదనరు" అన్నాను

ఆమె ఆనందంగా నా ముఖంలోకి చూచింది రాధ ఎంత అందమైనదో అంతవరకూ నాకు తెలియలేదు. నా మంచంమీద ఆమెను నిద్రపుచ్చాను ఆమె సమీపంలో ఒక కుర్చీలో ఆమె పెట్టిన తలగడామీద తలపెట్టి నిద్రపో ప్రయత్నించాను. రాధ అందమైన శరీర లావణ్యం, పసిమివన్నె, నిర్మలమైన ముఖం, తీర్చి దిద్దిన అవయవాలు, అందానికి తగ్గ వినయ విధేయతలా, మాట పొందిక నన్ను ఉక్కిరి బిక్కిరి చేశాయి. 'నాఅంత అదృష్టవంతుడు యింకెవరు?' అని పొంగిపోయాను. ఆనాటి మా నిష్కల్మష వర్తనానికి క్షణ క్షణానికి విలువకట్టే గడియార మొక్కటియే సాక్షి ఆనాటినుండి రాధ నా పత్నిగా భావించాను. ప్రసాదరావుగారు రాగానే వివాహం చేసుకుందామను కున్నాను. కాని తీర్థయాత్రల వలన ఆయన రాలేకపోయారు. రూము విడచి ఆ ఊరిలోనే పెద్దఇంటిలో చేరాను. కొద్ది రోజుల్లోనే నాకు ఉద్యోగం వచ్చింది. అది రాధ అదృష్ట మనే పొంగిపోయాను. రాధను నేను మనసార ప్రేమించాను ఆమె నన్ను ప్రేమించింది నేను సుఖంగా జీవించింది కొంతకాలం రాధతోనే.

కాని అది చాల కొద్దికాలమే!

పరీక్ష లై పోయినా నేను యింటికి వెళ్ళకపోవడం మా యింట్లో అంతా కంగారు పడ్డారని ఉత్తరాలు చెప్పాయి రాధ నన్ను వెళ్ళరమ్మని చాలసార్లు బ్రతిమాలింది. కాని ధైర్యం చాలక యింటికి వెళ్ళలేదు ఒక్కరోజు రాధ, 'నేను తండ్రిని కాబోతున్నా'నని చెప్పింది. నా ఆనందానికి అంతేలేదు ఇంటిదగ్గర నుండి ఉత్తరాలు వస్తునేఉన్నాయి నేను ఏదో సమాధానం వ్రాసి పంపుతూనే ఉన్నాను రాధకు నెలలునిండాయి. ఒకరోజున పండంటి కొడుకును నా కర్పించింది. నామకరణోత్సవంలో నేనూ రాధా చాల ఆనందంగా ఉన్నాము. ఇంతలో ఇంటినుండి నాకు ఉత్తర మొచ్చింది.

నాకు పెళ్ళి నిశ్చయ మైందని, వెంటనే రావలసిన దని మా తాతగారు వ్రాశారు. రాధకు ధైర్యం చెప్పి ఇంటికి బయలుదేరాను. అదే కడసారి చూపు రాధను మళ్ళా తిరిగి చూచుకోలేక పోయాను.

నే నింటికి చేరాను. అందరూ నాతో ముభావంగా ఉండడం గమనించాను. నాన్నగారు భోజనం దగ్గర చెప్పారు, నాకు పెళ్ళి నిశ్చయ మైందని

"అవును, విన్నాను. నాకీ పెళ్ళి యిష్టంలేదు" అన్నాను.

"ఎందుకని?" అన్నారు నాన్నాగారు.

"నా యిష్టా యిష్టాలతో మీకు పని లేదా ?" అని అడిగాను.

"నీకు మా యిష్టా యిష్టాలతో పనిలేనప్పుడు మాకుమాత్రం ఎందుకుండాలి నీవు ఎవరినో ఉంచుకున్నావనే తెలిసి ఈ పెళ్ళి నిశ్చయించాము "

"పొరపడ్డారు. నే నామెను పెళ్ళి చేసికున్నాను. ఆమె మీ కోడలు ''

"అది నా గొంతులో ప్రాణ మున్నంతవరకు జరుగని పని మీ తాతయ్య ఇంకా బ్రతికే ఉన్నాడు కులగోత్రాలు లేని పెళ్ళి నే నుండగా జరుగనీయను" అంటు లేచారు తాతయ్య.

నా పెళ్ళి విషయం ఇంటో పెద్ద సంచలనం కలిగించింది. నే నామెను ఇంటికి తీసికొని వస్తే ఇక నా తరువాతి తమ్ములకు, చెల్లెళ్ళకు పెళ్ళిళ్ళు జరుగవని ఒక రన్నారు నూతిలో దూకుతా నని అమ్మ అన్నది మా నాన్న సన్యాసుల్లో కలిసిపోతా నన్నారు పెద్దక్కయ్య. చిన్నక్కయ్య నన్ను బ్రతిమలాడారు. పెద్దన్నయ్య గ్రుడ్లురిమాడు కాని ఒక్కరూ నేనామెకు అన్యాయం చేస్తున్నట్టు తలచలేదు నాకు మతిపోయినంత పనైంది పెళ్ళి ప్రయత్నాలు జోరుగా సాగుతున్నాయి నా బాధ అర్థం చేసుకునేవారు లేకపోయారు మా చిన్న అన్నయ్యకు నా బాధ చెప్పుకొని ఆమెను రాజమండ్రిలో నా స్నేహితుని ఇంట్లో వదిలేయమని డబ్బిచ్చి పంపాను, కాని వాడుకూడా నాముందు యిష్టం నటించి నాటక మాడాడు మూడు రోజుల్లో నాకు ప్రసాదరావు గారి దగ్గరనుండి రాధ నాలుగు రోజులు జ్వరంతో బాధపడి మరణించిం దని 'వైరు' వచ్చింది. అదే వార్త విచార ముఖంతో చిన్నన్నయ్య చెప్పాడు ఇది ఆధారంగా తీసికొని నా పెళ్ళికి అందరూ నన్ను సాధించారు నేను ప్రసాదరావుగారికి వెంటనే ఉత్తరం వ్రాశాను. కాని సమాధానం రాలేదు. పిల్లవా దేమయ్యాడో నాకు తెలియలేదు. రాధ చావువార్త విని నాకు మతిపోయినంత పని అయింది. ఆ విచారంలో నే నెవరిని పెండ్లిచేసుకున్నదీ పట్టించుకోలేదు నేను యిల్లు విడచి ఎక్కడికి పోతానో అని రెండు సంవత్సరాల వరకూ ఇల్లు కదలనీయలేదు మా ఖామగారు నేను రాధకు చేసిన ద్రోహం నన్ను విడిచిపెట్టలేదు ఇరవై ఏళ్ళు ఎదిగిన కొడుకు చనిపోయాడు. ఆస్థి పోయింది. నేను తన్ను ప్రేమించటం లేదని నా భార్య మరణించింది, మనో వ్యాధితో.

కానీ! రఘూ! రాధ చచ్చిపోలేదు. ఆమె చచ్చిపోయినట్టు అన్నయ్యే వైరు చేసాడు. తాతగారి ఆజ్ఞప్రకారం విమలతో నా పెళ్ళి అయినట్టు చెప్పి, నన్నామె విడిచినట్టయితే 10 వేలు డబ్బిస్తా మని రాధను ఆశపెట్టారట. కాని ఆమె డబ్బు తీసుకోక నా సుఖంకోసం వెళ్ళిపోయిం

దట. ఆమె యిల్లు విడిచిన సంగతి విని ప్రసాదరావుగారు ఆమెను తీసికొనివచ్చి రాజుకు చదువు చెప్పించారట ఇదంతా రెండు నెలల క్రితం నాకు అకస్మాత్తుగా రైలులో కలిసిన ప్రసాదరావుగారు చెప్పారు రాధ ఈ ఊళ్ళోనే ఉందనికూడా అన్నారు నేను రాధని చూడడానికి వెళ్ళలేకపోయాను నేనామెముందు ముఖం ఎత్తలేను నాకిక శాంతి లేదు నిర్మల నాకెంతో రాధ కొడుకు రాజుకూడ అంతే వారి వివాహం అసంభవం రాధను నేను మనసార ప్రేమించాను ఆ సంగతి ఆమెకు తెలుసు నని నేననుకోను నేనామెకు నిజంగా చాల అన్యాయం చేసాను నాలోని ఆనాటి ప్రవర్తన నాకే సిగ్గని పిస్తున్నది నేను ఆనాడు రాధను తీసుకొని వెళ్ళిఉంటే నా రాధ నాకు దక్కేది ఏ రాధకై జీవితమంతా వ్యథతో కుమిలిపోతున్నానో ఆ రాధను చూచే ధైర్యం నాలో లేదు ఏ కళ్ళు నన్ను ప్రేమానురాగాలతోటి లాలించాయో, ఆ కళ్ళలోనికి నేను చూడలేను ఏనాడు నా పత్నిగా వ్యవహరింపబడిన విమల నన్ను వీడిందో ఆనాడే నేనూ మరణించేవాడిని. కానీ నిర్మల నన్ను చావనీయలేదు, నిర్మలకోసం ఇన్నినాళ్ళు బ్రతికేను ఇక నిర్మల విషయమై నాకు భయం లేదు. నిర్మలకు తల్లి ఉన్నది నిర్మలను రాధకు ఒప్పజెప్పు చిన్ననాటినుండి నిర్మలను ఏవిధంగా పెంచానో నీకు తెలుసు నిర్మల బాధ్యత నీది ప్రశాంతతకోసం దూరతీరాలకు పోవా లనుకుంటున్నాను కానీ ఎక్కడికి పోతే నాకు ప్రశాంతత దొరుకుతుంది? నాకు లోక మంతా రాధమయమే నేను రాధను చూడలేను చూడకుండా తప్పించుకోవాలి

నిర్మల పెళ్ళికి నా కున్నఆస్తి కూలిపోతున్న మేడ ఒక్కటే బహుశా నేనిచ్చే కానుక చూచి నవ్వుకుంటావేమో కుమిలే బ్రతుకులతో, రగిలే గాయాలతో, కూలిన శరీరం, నే నింతకన్నా ఏమి యీయగలను

'మాధవ్'

ఉత్తరం చదువగానే కంగారుపుట్టింది పరుగెత్తుకొని మాధవ్ ఇంటికి వెళ్లాను. నిర్మలను, తీసికొని, ప్రశాంత నిద్రలో మునిగి ఉన్నాడు మాధవ్, అప్పటికేకాదు, నిర్మల పెళ్ళినాటి బ్యాండు మేళాలు కూడ మధును లేపలేకపోయాయి రాధ రోదనలుకూడ అతనిని కదల్పలేకపోయాయి నేననుకుంటాను, మాధవ్ ప్రశాంత సౌధాలలోకి ఏకాంత జీవితానికై పయనించి పోయాడని ఏనాటికైనా అతడు క్షంతవ్యుడనే అనుకుంటాను